క్లుప్తంగా

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



వంటలు రుచిచూస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ వై.దుర్గారావు అన్నారు. మండల పరిధి ఓనెఅగ్రహారం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు అడిగితెలుసుకున్నారు. వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకం వంటకాలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సర్వే

రాజాం: మండలంలో పొగిరి, గుయ్యానవలస, మొగిలివలస తదితర గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సర్వే బుధవారం నిర్వహించారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు, పలుశాఖల కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ఆర్థిక ప్రగతితో పాటు జీవన లక్ష్యాలపై ఆరా తీశారు. ప్రజలు చెప్పిన వివరాలు నమోదుచేసుకున్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రభుత్వం ఎంతవరకు చేరుకుందో తెలుసుకునేందుకు ఈ సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.

పంచగవ్యతో పంటకు మేలు

బొబ్బిలి రూరల్: పంచగవ్యతో పంటలకు మేలు కలుగుతుందని ప్రకృతిసేద్యం ప్రతినిధి యు.శంకరరావు తెలిపారు. జగన్నాథపురం ఆర్బీకే వద్ద బుధవారం పంచగవ్య తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, ఆవుమూత్రం, పెరుగు, నెయ్యి, కొబ్బరినీళ్లు, కల్లు, అరటిపండ్లు, నీళ్లు, నల్లబెల్లం నిర్ణీత పరిమాణాల్లో తీసుకుని వాటిని బాగా కలిపి 15 రోజులు నిల్వ ఉంచాలని, అనంతరం దాన్ని వడపోస్తే పంచగవ్య తయారవుతుందన్నారు. దీన్ని 6నెలల పాటు వాడుకోవచ్చని సూచించారు. పంచగవ్య మొక్క పెరుగుదలకే కాకుండా చీడపీడలు దరిచేరవని, పువ్వు, పిందె రాలకుండా గింజలు బాగా పెరుగుతాయని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ నాగరాజు

రాజాం: ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఎంవీ నాగరాజు అన్నారు. పట్టణంలో బుచ్చింపేట, డోలపేట గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను బుధవారం ఆయన పర్యవేక్షించారు. తొలగించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణపై స్థానికులకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాగ్యలక్ష్మి ఉన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారే పనులకు రావాలి



వావిలవలసలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

రేగిడి: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే రావాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. మండలంలోని తోకలవలస, వావిలవలస, లింగాలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులను బుధవారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వేతనదారులకు వివరించారు. జాబ్‌కార్డులు ఉన్నవారికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని, పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్.హరనాథరావు, సర్పంచ్ మొయిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గులారీ బోల్తా



రోడ్డుపై బోల్తాపడిన బొగ్గులారీ

రామభద్రపురం: మండల కేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారిలో బుధవారం తెల్లవారు జాము 4 గంటల సమయంలో బొగ్గు లారీ అదుపుతప్పి బోల్తాపడింది. విశాఖపట్నం నుంచి రాయపూర్‌కు బొగ్గులోడుతో వెళ్తున్న లారీ చిన్నమ్మతల్లి ఆలయం సమీపం వద్ద ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి బోల్తాపడినట్లు డ్రైవర్ అమన్ తెలిపాడు. రోడ్డుకు అడ్డంగా లారీ పడిపోవడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నవరత్నాలతో ప్రజా సంక్షేమం

● ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి:

నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని వెంకమ్మపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలపై, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చారని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాలు సైతం అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతుండడంతో లబ్ధిదారులంతా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వద్ద తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, ఎంపీడీఓ జి.కాశీవిశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

లోకేశ్ తీరు హాస్యాస్పదం

● ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో నారా లోకేశ్ నిరాశ, నిస్పృహలతో అసందర్భ పేలాపనలు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు యువగళం యాత్రలో లోకేశ్ మాటలు, చేష్టలు చూసి జనాలు నవ్వుకుంటున్నారని, నెట్టింట ట్రోల్స్ చేయడాన్ని అందరం గమనిస్తున్నామన్నారు. వర్ధంతికి, జయంతికి తేడా తెలియని లోకేశ్‌కు జగన్ సత్తా తెలుసుకోలేకపోతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌పై ఎవరెన్ని కేసులు పెట్టినా, ఇబ్బందులు సృష్టించినా ఏనాడూ భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగారని గుర్తు చేశారు. పప్పు పులకేశిని చూసి నవ్వుకునేవాళ్లే తప్ప భయపడేవాళ్లు లేరని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఆరు వందలకు పైగా హామీలను ఇచ్చి, అధికారంలోకి రాగానే వాటిని పక్కన పడేసిన పార్టీ టీడీపీ అయితే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసి చూపించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. 2024 ఎన్నికల్లో లోకేశ్, చంద్రబాబు ఎమ్మెల్యేలుగా గెలుస్తారో లేదో తెలియని స్థితిలో వారు, ఆ పార్టీ నాయకులు ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, పట్టణ జేఏసీ కన్వీనర్ రేజేటి విశ్వేశ్వరరావు, రామభద్రపురం జేఏసీ కన్వీనర్ పత్తిగుళ్ల ఏకనాథ్, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులెవరూ ఆందోళన చెందొద్దు



పారాదిలో వ్యవసాయశాఖ ఏడీఏ నుంచి ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ నారదముని

బొబ్బిలి రూరల్: వరి రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ నారదముని అన్నారు. మండలంలో పారాది, కోమటపల్లి, చింతాడ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్‌తో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి ధాన్యం దిగుబడి, మిగులు ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు లక్ష్యాలకు సంబంధించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. 80 శాతం లక్ష్యం పూర్తయిందని అధికారులు చెప్పడంతో మిగులు ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సూచించారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమామణి కోరారు. స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్‌లో నిర్వహించిన ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంఈఓ తిరుమలప్రసాద్‌తో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు అవసరమన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహించే ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రజలు తమ ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9న రామభద్రపురం, ఆరికతోట ఉన్నత పాఠశాలల్లో, 10న కొట్టక్కి ఉన్నత పాఠశాల, రామభద్రపురం శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఆధార్ స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మునాయుడు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ క్రాంతి పథకం ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మునాయుడు అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, జగనన్న తోడు, చేయూత, ఆసరా వంటి పథకాలను డ్వాక్రా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలని సూచించారు. బ్యాంకు గ్యారంటీ ఉన్నవారికి 35 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు జి.వెంకటరమణ, రత్నకుమార్, సీసీలు వీఓఏలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్

రాజాం: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, ఇందులో విద్యార్థినుల పాత్ర చాలా గొప్పదని రాజాం సెంటాన్స్ స్త్రీశక్తి సెంటర్ డైరెక్టర్ సిస్టర్ హిల్డా, సిస్టర్ దీప అన్నారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్త్రీశక్తి మాక్స్ సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, నివారణ మార్గాలు, చట్టాలపై విద్యార్థినులకు బుధవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాలపై, ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలు, అక్రమ రవాణపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ బి.గోపి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ఆరోగ్యం నాశనం



సంతకవిటి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై జనార్దనరావు, తదితరులు



రామభద్రపురం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యం పాడవుతుందని ఎస్సై సురేంద్రనాయుడు అన్నారు. స్థానిక వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దని, చక్కగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. మాదకద్రవ్యాల రవాణాపై నిఘా పటిష్టం చేసినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి

సంతకవిటి: రాష్ట్రాన్ని డ్రగ్ రహితంగా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం కూడా అవసరమని సంతకవిటి ఎస్సై ఆర్.జనార్దనరావు అన్నారు. మందరాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం దాసరి కృష్ణారావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల రికార్డుల ఆడిట్



రికార్డుల ఆడిట్ పరిశీలిస్తున్న ఏపీఎం

రాజాం: మండలంలో పెనుబాక, బొద్దాం, గురవాం తదితర గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల రికార్డుల ఆడిట్‌ను ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత బుధవారం పరిశీలించారు. సీఆర్పీలు రికార్డుల నిర్వహణపై దృష్టిసారించాలని, ప్రతీ విషయాన్ని నమోదుచేయాలన్నారు. రికార్డులు నిర్వహణపై సీసీలు, సీఎఫ్‌లకు అవగాహన కల్పించాలని ఆడిట్ సిబ్బంది సూచించారు. ఆమె వెంట అదనపు ఏపీఎం టి.దధికుమార్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.అరుణకుమారి ఉన్నారు.

సచివాలయాల తనిఖీ

రాజాం: గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. ఒమ్మి, గడిముడిదాం, రాజయ్యపేట తదితర గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, దిలీప్ తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: పట్టణంలో స్వామివారి వీధిలో వేంకటేశ్వరాలయం తృతీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు పాల్గొని పూజలు చేశారు.

నేడు గొర్లెసీతారాంపురంలో 'గడపగడపకు..'

బొబ్బిలి రూరల్: మండలంలో గొర్లెసీతారాంపురంలో గురువారం ఉదయం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లు భాస్కరరావు తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



పండూరి రమణమూర్తి

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయిబ్రాహ్మణులంతా రుణపడి ఉంటామని ఏపీ నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పండూరి రమణమూర్తి అన్నారు. రేగిడిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యులుగా నాయిబ్రాహ్మణులను చేర్చడం చాలా ఆనందంగా ఉందన్నారు. సెలూన్ షాపులకు ఉచితంగా విద్యుత్, చేదోడు పథకం కింద రూ.10 వేలు ఆర్థికసాయం అందించడంతో పాటు నాయిబ్రాహ్మణలపై సీఎం చూపిస్తున్న అభిమానం ఎనలేనిదన్నారు.

ప్రకృతి సాగు లాభదాయకం



ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: మండలంలో మామిడిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విధానంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు చేయడం వల్ల కలిగే లాభాలను ఎంటీఎస్ఎఫ్ శారద వివరించారు. చిరుధాన్యాల సాగు లాభదాయకమన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రమాదేవి, అప్పలనాయుడు, సరస్వతి, పంచాయతీ సర్పంచ్ కె.రేవతి, మీపీఏలు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న కరస్పాండెంట్ కార్తీక్

బొబ్బిలి రూరల్: కోమటపల్లి భాస్కరా ఫార్మసీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకను పట్టణంలోని సూర్యారెసిడెన్సీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఫార్మసీ విభాగం విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, ప్రొఫెసర్ ఐ.రాజ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ టీఎస్ఎస్ కార్తీక్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొణతాల రాజేష్ ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

సాగునీటి చెరువులు ఆక్రమిస్తే చర్యలు

● ఆర్డీఓ శేషశైలజ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శైషశైలజ

రామభద్రపురం: సాగునీటి కాలువలు, చెరువులు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శేషశైలజ అన్నారు. మండలంలోని కొట్టక్కి రెవెన్యూ పరిధి మిరితివలసకు వెళ్లే రహదారి వద్ద ఉన్న సీతన్న చెరువును రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని కొట్టక్కి, మిర్తివలస రైతులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సూర్యకుమారికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ బుధవారం సీతన్న చెరువు ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్, వీఆర్వో, మండల, గ్రామ సర్వేయర్లను సమావేశమై ఆ చెరువుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం చేపడుతున్న రీ సర్వేలో సాగునీటి చెరువులు, సాగునీటి కాలువలను కూడా సర్వే చేయడం జరుగుతుందని, ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని తొలగించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 52 గ్రామాల్లో రెండో దశ రీ సర్వే జరుగుతోందన్నారు. 10 గ్రామాల్లో డీఎల్ఆర్, 13 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందన్నారు. సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ గడువును ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు పొడిగిస్తూ ప్రభుత్వం దేశాలు జారీ చేసిందన్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం 2021 నవంబర్ 1వ తేదీ ముందు వరకు జరిగిన లావాదేవీలను పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం కావాలి



వీఓఏ ప్రియాంకను సత్కరిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ, వెలుగు అధికారులు

వంగర: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారతే లక్ష్యంగా గ్రామైక్య సంఘాలు, వీఓఏలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీఓఏలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాల మంజూరు లక్ష్యాలను చేరుకున్న వీఓఏలను ఎంపీపీ సత్కరించారు. గ్రామాల్లో మహిళలు ఆర్థిక అవసరాలకు స్త్రీనిధి రుణాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, రాజాం ఏరియా కో-ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, ఏపీఎంలు మీసాల చక్రపాణి, బాసిన గోవిందరావు, వై.ఆనందరావు, ఎన్.అప్పలనాయుడు, స్త్రీనిధి క్లస్టర్ మేనేజర్ సుధాకర్, ఎస్‌వీఈపీ ప్రాజెక్టు క్లస్టర్ బీపీఓ శేషగిరి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

యానాదుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న యానాదులు

బొబ్బిలి రూరల్: యానాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యానాదులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తమను ఎస్టీలుగా గుర్తించి, ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సోరు సాంబయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో యానాదుల సమస్యలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ ప్రాంతంలో మత్స్యకారుల భూములు, చెరువులు, దళిత గిరిజన భూములను పెత్తందార్లు ఆక్రమించారని, ఆక్రమణలు తొలగించి అర్హులకు ఆ భూములను అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎస్.రాజారావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ విజయ్‌కుమార్, కూపర్ క్లెవ్, కనక మహేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



పెరుమాళి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తెర్లాం:

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. పెరుమాళి గ్రామంలోని మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాలు వండిపెట్టాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. ప్రహరీ చుట్టూ వివిధ రకాల మొక్కలు నాటాలని ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మికి సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

గాయత్రీదేవి యాత్ర ప్రారంభం



పుష్పాలంకరణలో గాయత్రీదేవి

రాజాం సిటీ: పట్టణంలో చీపురుపల్లి రోడ్డులో వెలసిన గాయత్రీదేవి ఆలయ 30వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. ఈ నెల10 వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, కొండవేటి వివేకానందరావు తెలిపారు.

బాలపార్వతమ్మ యాత్ర

సంతకవిటి: మండలంలో మండాకురిటి గ్రామంలో బాలపార్వతమ్మ ఆలయ 66వ యాత్రా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ యాత్రలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. చివరిరోజు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాణసంచా పోటీలు, రేలారే రేలా పాటల పోటీ, బాలు రైడర్స్ క్లాసికల్ ఈవెంట్ ఆకట్టుకున్నాయి.